

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

విత్తనాలు, ఎరువులు కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దని చెబుతున్నారు. - 8లో



జీడిపప్పు అక్రమ రవాణా!

జీఎస్టీ, మార్కెట్ యార్డు అనుమతులు లేకుండానే కొందరు జీడిపప్పును అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. - 8లో

10న జిల్లా స్థాయి రగ్బీ ఎంపికలు

టెక్కలి: ఈ నెల 10న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి రగ్బీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పి.పార్వతీశం, నిర్వాహకుడు బి.నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల విభాగంలో నిర్వహిస్తున్న ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

10న ఆదిత్యాలయ హుండీ ఆదాయం లెక్కింపు



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ హుండీ కానుకల ఆదాయం లెక్కింపు ప్రక్రియ ఈ నెల 10న అనివెట్టి మండపంలో నిర్వహిస్తున్నట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు శంకరశర్మల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు జరుగుతుందని, గ్రామ పెద్దలు, స్థానికులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

బాధితులకు అండగా లీగల్‌సెల్



పోలాకి: ఎన్నికల ఫలితాల తరువాత వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో అందరూ సంయమనం పాటించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు జి.వి.వి.గణేష్‌నాయుడు కోరారు. ఈ మేరకు శనివారం లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి సూచనల మేరకు ప్రకటన విడుదల చేశారు. గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలని కోరారు. బాధితుల కోసం అన్ని నియోజకవర్గాల్లోనూ లీగల్ బృందాలు అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు. చట్టప్రకారం దోషులకు కోర్టు ద్వారా శిక్షలు పడతాయన్నారు. ముఖ్యంగా యువత ఇలాంటి వ్యవహారాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. అన్యాయంగా దాడులకు గురైన వారికి నైతికంగా అండగా నిలిచేందుకు వివిధ విభాగాల పార్టీ ఇన్‌చార్జిలు, నాయకులతో కూడిన కమిటీలు సిద్ధంగా ఉన్నాయని ధైర్యం చెప్పారు.

సజావుగా ఏపీ ఎడ్‌సెట్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఏపీ ఎడ్ సెట్–2024 పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా నుంచి 992 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 876 మంది హాజరయ్యారు. 116 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీస్ పరీక్ష కేంద్రంలో 330 మందికి 295 మంది, టెక్కలి ఐతం కళాశాలలో 302 మందికి 278 మంది, చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో 180 మందికి 153 మంది, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో 180 మందికి 150 మంది హాజరయ్యారు. ఎడ్‌సెట్ పరిశీలకులు పర్యవేక్షించారు.

పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజీనామా



రాజీనామా పత్రంతో రాజాపు హైమావతి

నరసన్నపేట: రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని శనివారం కార్పొరేషన్ ఎండీకి ఆన్‌లైన్‌లో పంపినట్లు హైమావతి తెలిపారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీ కులాలకు అధిక ప్రాధాన్యం లభించిందని, దీనిలో భాగంగా తనకు పదవి వచ్చిందని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందడంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ కార్యక్రమాలకు ఎప్పటిలాగే సహకరిస్తానని తెలిపారు. తనను కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు, కృషి చేసిన మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ శయన కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా



డి.పి.దేవ్


శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ పదవికి డి.పి.దేవ్ శనివారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ప్రజాతీర్పును గౌరవిస్తూ రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈయన తన పదవీ కాలంలో కులం అభ్యున్నతికి, అభివృద్ధికి రాష్ట్రంలోని అనేక గ్రామాలు తిరిగి సమైక్యత కోసం శ్రమించారు. 2023 సెప్టెంబరులో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో మంత్రి ధర్మాన ప్రసాదరావు సహకారంతో కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు.



- **నరసన్నపేటలోని** ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. రెండు నెలలుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉంటోంది. ఆన్‌లైన్‌లో జాబ్ కోసం వెతుకుతూ ఓ వెబ్‌సైట్ లింక్ క్లిక్ చేసింది. దానికి ప్రతిగా వారు ఇంటి వద్ద ఉంటూనే మీరు కొంత సొమ్ము పెట్టుబడిగా పెడితే అంతకు రెట్టింపు వస్తుందని నమ్మబలికారు. మొదట్లో కొంత సొమ్మును బాధితురాలి ఖాతాకు పంపించినా.. తర్వాత దఫదఫాలుగా రూ.40 లక్షల వరకు టోకరా వేశారు. తర్వాత వారికి సంబంధించిన నంబర్లు, వాట్సాప్ గ్రూపులు బ్లాక్ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.



- **టెక్కలిలోని** బర్మాకాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. పత్రికల్లో వచ్చిన ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటన చూసింది. అది మోసపూరితమైందా.. కాదా అన్నది తెలుసుకోకుండానే లక్షల్లో వేతనం ఉంటుందని వారు చెప్పిందల్లా నమ్మి దఫదఫాలుగా రూ.10 లక్షల వరకు చెల్లించింది. వారు ఫోన్లు ఎత్తడం మానేయడంతో మోసపోయానని గ్రహించి 1930 సైబర్‌సెల్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేసింది.



- **కోటబొమ్మాళిలోని** ఓ ప్రభుత్వోద్యోగి. నెలకు వేలల్లో సంపాదన.. అయినా షార్ట్‌రూట్‌లో డబ్బులు సంపాదించాలనే ఆశతో వర్క్‌ఫ్రం హోం పేరిట ఆన్‌లైన్ టాస్క్‌ల్లో పాల్గొన్నాడు. మొదట్లో డబ్బులు వస్తున్నట్లే వచ్చి.. చివరికి రూ.20 లక్షల వరకు పోగొట్టుకుని ఉసూరుమన్నాడు. చేసేది లేక పోలీసులను ఆశ్రయించాడు.
- **ఇచ్ఛాపురంలోని** ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రూ.2.60 లక్షలు, రణస్థలంలోని ఓ నిరుద్యోగ యువకుడు రూ.1.60 లక్షలు, శ్రీకాకుళం నగరంలోని అరసవల్లిలో ఓ వివాహిత రూ.2.40 లక్షలు.. ఇలాంటి ఆన్‌లైన్ సైట్లు, ఉద్యోగ ప్రకటనలు చూసి మోసపోయారు. ఇటీవలే ఈ ఘటనలన్నీ చోటుచేసుకున్నాయి.

పార్ట్ టైమ్ జాబ్ కాదు ఫుల్ టైమ్ ఫ్రాడ్

- జిల్లాలో పెరుగుతున్న పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్స్
- ఒక్క ఏడాదిలోనే 560 ఫిర్యాదులు
- ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటనలపై అప్రమత్తత అవసరమంటున్న సైబర్ కాప్స్



శ్రీకాకుళం క్రైమ్ :

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది ఐదు నెలల్లోనే 1022 సైబర్ ఫ్రాడ్ ఫిర్యాదులు రాగా అందులో సుమారు 560 వరకు ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్‌లే. పై ఉదాహరణలన్నీ చూస్తే యువత బలహీనతలు గ్రహించి సైబర్ నేరగాళ్లు ఏ విధంగా మోసగిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. పోలీసులు ఇలాంటి ఆన్‌లైన్ సైట్ల ప్రకటనల జోలికి వెళ్లి డబ్బులు పోగొట్టుకోవొద్దని.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

నకిలీ ఉద్యోగాలు..

ఇటీవల కాలంలో నకిలీ ఉద్యోగాల బాధితులు పెరుగుతున్నారు. ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్స్, పార్ట్ టైమ్ జాబ్‌ఫ్రాడ్స్, డేటా ఎంట్రీ స్కామ్స్, వర్క్‌ఫ్రం హోమ్ జాబ్ స్కామ్స్ తరహా మోసాల్లో బాగా చదువుకున్న యువతే చిక్కుకోవడం గమనార్హం. ఆన్‌లైన్ జాబ్ సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, పత్రికల్లో నకిలీ ప్రకటనలు నమ్మి మోసపోతున్నారు. తక్కువ టైమ్‌లో ఎక్కువ సంపాదించాలనే బలహీనత ఉన్న యువత ఇలాంటి మోసగాళ్ల ఉచ్చులో పడి తమ బ్యాంకు ఖాతాలు ఖాళీ చేసుకుంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం ఇంజినీరింగ్ యువతతో పాటు ప్రభుత్వోద్యోగులు, నిరుద్యోగ యువత ఉండటం గమనార్హం.



అంతా కాల్‌సెంటర్ల ద్వారానే..

నకిలీ ఉద్యోగాలలో సైబర్ నేరగాళ్ల వద్ద అందరి బయోడేటా ఉంటుంది. ఆన్‌లైన్ జాబ్ సెర్చింగ్ సైట్‌లకు జనం ఇచ్చే రెజ్యూమోలు వీరు సేకరిస్తుంటారు. ఒక కాల్ సెంటర్ వంటి సెటప్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో వారి నుంచి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లుగా మోసపూరిత మెయిల్లను పంపిస్తారు. ఆ మెయిల్‌కు స్పందిస్తే అసలైన జాబ్‌కు నిర్వహించే ప్రక్రియనే వీరూ అనుసరిస్తారు. అలా మోసం చేస్తూ నిరుద్యోగి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు, యూనిఫాం అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకుని తర్వాత మాయమైపోతారు.

వారే టార్గెట్..

మనలో చాలా మంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పనిచేయడానికే ఇష్టపడతారు. జాబ్ స్కామ్ చేసేవాళ్లు వీరినే టార్గెట్ చేసుకుంటున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే నెలకు వేలాది రూపాయలు సంపాదించగల జాబ్స్ తమ వద్ద ఉన్నాయంటూ తరచూ ఆన్‌లైన్ ప్రకటనలు ఇస్తుంటారు. ఎవరైనా వీటిని నమ్మి సంప్రదిస్తే ఫీజులు, చార్జీల రూపంలో డబ్బులు కట్టించుకుని మోసగిస్తారు. ఈ ప్రకటనలు ఆన్‌లైన్‌లోనే కనిపిస్తాయి. వాట్సాప్ ఫార్వర్డ్‌ల రూపంలోనూ ఉంటాయి.

డేటా ఎంట్రీ స్కామ్స్..

డేటా ఎంట్రీ స్కామ్స్ రకరకాలుగా ఉంటాయి. ఎక్కువ స్కిల్స్ అవసరం లేకుండానే సింపుల్ డేటా ఎంట్రీ చేస్తే చాలు డబ్బులు సంపాదించొచ్చని నమ్మబలుకుతారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో అడ్వాన్స్ పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులు ఉన్నాయని, దాని వల్ల సంస్థ నష్టపోయిందని, నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళ్తామని బెదిరించి అధిక మొత్తంలో తిరిగి డబ్బులు వసూలు చేస్తారు.

చదువుకున్న యువతే..



చదువుకున్న యువతీ యువకులు, అందులోనూ ఎక్కువ శాతం ఇంజినీరింగ్ యువత ఇలాంటి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండటం బాధాకరం. తక్కువ టైమ్‌లోనే ఎక్కువ సంపాదించాలనే ఆశే కొంపముంచుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఏం చేస్తుంటారన్నది గ్రహిస్తే మంచిది. ఆన్‌లైన్ జాబ్ ప్రకటనలు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి.

– గుండుమోను ఉమామహేశ్వరరావు, రెండో పట్టణ సీఐ, శ్రీకాకుళం

కష్టాన్ని నమ్ముకోవాలి..



కొండలను పిండిచేసే సత్తా యువకులకే సాధ్యం. అలాంటి యువత తమ కష్టాన్ని నమ్ముకుని, స్కిల్స్ ఉపయోగించి సత్తా చాటితే మెరుగైన ఉద్యోగాలు సంపాదించొచ్చు. ఇలాంటి ఆన్‌లైన్ సైట్లను చూసి డబ్బులను పోగొట్టుకోవడం, బాధపడటం ఆర్థికంగా నష్టాన్నే కాక.. మిమ్మల్ని ఆత్మనూన్యతా భావంలోకి నెట్టుతుంది.

– లెంక సన్యాసినాయుడు, రూరల్ సీఐ, శ్రీకాకుళం

ఇలా గుర్తించాలి..



- ఉద్యోగ ప్రకటనలు అన్నీ నిజం కావు అనే సత్యాన్ని గ్రహించాలి.
- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజు వంటివి పెద్ద మొత్తంలో తీసుకోవు.
- ప్రకటనల్లో ఉపయోగించే లోగోలు, లెటరింగ్స్‌ను ఒకటికి రెండుసార్లు గమనించాలి.
- అసలైన సంస్థ ఎప్పుడూ ఈ–మెయిల్ ద్వారానే కమ్యూనికేషన్ చేస్తారు. కానీ జాబ్‌స్కామ్/ఫ్రాడ్ చేసేవారు పంపే మెయిల్‌ను గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి.
- జాబ్‌స్కామ్స్ వారు ఇచ్చే ఉద్యోగ ప్రకటనల్లో గానీ, ఈ–మెయిల్స్‌లో గానీ ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది.
- 'క్విక్ మనీ, అన్ లిమిటెడ్ ఎర్నింగ్స్, ఎలాంటి టెక్నికల్ స్కిల్స్ అవసరం లేదు' అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తమవ్వాలి. ఒక చట్టబద్ధమైన సంస్థ ఎప్పుడూ ఇలాంటివి చేయదన్నది గ్రహించాలి.

- **మోసాలకు గురయ్యేవారు 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.**

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: జిల్లాలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు టీడీపీ శ్రేణులు దిగుతుండటం మంచి సంప్రదాయం కాదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు ఆందోళన చెంద వద్దని, పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పలాసలో ఎంపీటీసీ గొండు మోహనరావుపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద టీడీపీ శ్రేణులు హల్‌చల్ సృష్టించడం సరికాదన్నారు. ఇటువంటి దాడులు కొనసాగితే పరిస్థితులు మరోలా ఉంటాయన్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటిస్తున్నారని, టీడీపీ శ్రేణులు, పోలీసులు గమనించాలన్నారు. పోలీసు యంత్రాంగం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

13 నుంచి డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 13 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం చెప్పారు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల షెడ్యూల్ వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని తెలిపారు.

ఎంపీ రామ్మోహన్‌కు కేంద్ర మంత్రి పదవి?

- పార్టీ వర్గాలకు సమాచారం
- చంద్రబాబుకు సన్నిహితంగా ఉండటంతో ప్రత్యేక గుర్తింపు
- కుటుంబమంతా టీడీపీలో ఉండటంతో ప్రాధాన్యం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎంపీ రామ్మోహన్ నాయుడికి కేంద్రమంత్రి పదవి ఖరారైనట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మోదీ 3.0 కేబినెట్‌లో మన జిల్లాకు చెందిన ఎంపీ రామ్మోహన్‌నాయుడికి ప్రాతినిధ్యం లభిస్తున్నట్టు సమాచారం. వరుసగా మూడు సార్లు గెలిచిన రామ్మోహన్‌నాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా ఉండటంతో కేంద్ర మంత్రి పదవి లభించబోతోంది. గతంలో ఈయన తండ్రి, దివంగత నేత కింజరాపు ఎర్రంనాయుడు వాజ్‌పేయ్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. హేట్రిక్ విక్టరీ సాధించిన రామ్మోహన్‌నాయుడు జిల్లా టీడీపీలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఆయనొక వర్గాన్ని తయారు చేసుకున్నారు. ఇప్పుడదే కలిసొచ్చినట్టుంది. 2014 ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసి లక్షా 27వేల మెజారిటీతో గెలిచారు. 2019 ఎన్నికల్లో 6 వేల మెజారిటీతో విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో 3లక్షల 27వేల 901 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎర్రంనాయుడు వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన రామ్మోహన్‌నాయుడు అదే వాగ్ధాటితో తనకంటూ అభిమానులను ఏర్పరచుకున్నారు.

ఆడుతూ.. పాడుతూ..!



చిత్రం గీస్తున్న చిన్నారి



తాము తయారు చేసిన బొమ్మలతో చిన్నారులు

- ఆనందోత్సాహాల నడుమ చిన్నారులకు వేసవి వినోదం
- చిత్రలేఖనం, సంగీతం, కూచిపూడిలో మెలకువలు నేర్చుకున్న 250 మంది చిన్నారులు
- నేటితో ముగియనున్న వేసవి శిక్షణా శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: వేసవి సెలవుల నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ఆదివారంతో ముగియనుంది. సుమారు 40 రోజుల పాటు చిన్నారులు వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. ఆడుతూ పాడుతూ మెలకువలు నేర్చుకున్నారు. పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయం ఆవరణలో నిర్వహించిన ఈ సమ్మర్ క్యాంపులో చిన్నారులకు చిత్రలేఖనం, పేపర్ క్విల్లింగ్, కూచిపూడి, సంగీతం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. సుమారు 250 మంది చిన్నారులు ప్రతిరోజూ ఆసక్తిగా హాజరై మెలకువలు నేర్చుకున్నారు. పలువురు విద్యార్థులు తమ ప్రతిభ కూడా ప్రదర్శించారు. ప్రతి వారం నిర్వహించిన పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలిచారు. వివిధ అంశాల్లో నందికేశ్వరరావు, బి.ఎం.ఎస్.పట్నాయక్, దుర్గాప్రసాద్, ఎల్.దీప్తి, పెంకి నాగేశ్వరరావు, టి.నీరజా సుబ్రహ్మణ్యం తదితరులు చిన్నారులకు శిక్షణ ఇచ్చారు.

నేడు ముగింపు సంబరం..

ఆదివారం చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరాల ముగింపు సంబరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బి.ఎం.ఎస్ పట్నాయిక్, నటుకుల మోహన్ తెలిపారు. చిన్నారులు సొంతంగా తయారు చేసిన వస్తువులను ప్రదర్శనగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. డ్యాన్సు, సంగీతం నేర్చుకున్న వారితో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పెయింటింగ్ నేర్చుకున్నా..

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పెయింటింగ్‌లో శిక్షణ పొందాను. అనేక మంచి విషయాలను నేర్చుకునేందుకు ఈ శిబిరం ఎంతగానో ఉపకరించింది.

– ఎల్.మాధురి, శ్రీకాకుళం

కాగితాలతో బొమ్మలు..

కాగితాలు, పనికిరాని వస్తువులతో అందమైన బొమ్మలు తయారు చేయడం నేర్చారు. మెలకువలు నేర్చుకుని సొంతంగా తయారు చేస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది.

– కె.లిఖిత, ఎం.అనీల్ కుమార్, శ్రీకాకుళం

సంగీతం ఇష్టం..



నాకు మొదటినుంచి సంగీతం అంటే ఇష్టం. వేసవిలో మా గురువు పెంకి నాగేశ్వరరావు వద్ద పలు కీర్తనలు పాడటం నేర్చుకున్నాను. అనేక అంశాలలో మెలకువలు తెలుసుకున్నాను.

– జి.హరీష్, శ్రీకాకుళం



సమ్మర్ క్యాంప్‌లో చిన్నారుల ఉత్సాహం

సెల్యూట్ చేస్తున్న జెమ్స్ ఆసుపత్రి సిబ్బంది



అవయవ ప్రదాత లక్ష్మణరావు



తంప లక్ష్మణరావు(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: సారవకోట మండలం సవరశి వరాంపురం గ్రామానికి చెందిన తంప లక్ష్మణరావు(38) మృతి చెందడంతో అతని కుటుంబసభ్యులు అవయవదానానికి అంగీకరించారు. భార్య భాగ్యవతి అంగీకారం మేరకు శనివారం లివర్‌ను విశాఖపట్నం కిమ్స్‌కు, లంగ్స్‌ను హైదరాబాద్ కిమ్స్‌కు, నేత్రాలను రెడ్‌క్రాస్ నేత్రసేకరణ కేంద్రానికి తరలించారు. లక్ష్మణరావు కిడ్నీ సమస్యతో ఈ నెల 5న జెమ్స్ ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతి చెందిన అవయవాలు మరికొందరికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో అవయవదానానికి కుటుంబ సభ్యులు అంగీకరించినట్లు జెమ్స్ ఆసుపత్రి డాక్టర్ ప్రవీణ్ తెలిపారు. అంతకుముందు లక్ష్మణ్ మృతదేహానికి ఆస్పతి సిబ్బంది సెల్యూట్ చేసి నివాళులు అర్పించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇటీవల సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని, శ్రీకాకుళం జిల్లాలోనూ పలు ఘటనలు జరుగుతున్నాయని, పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, రీజనల్ కో ఆర్డినేటర్ గేదెల వాసుదేవరావు, కార్యదర్శి ఆరంగి లక్ష్మీపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కోర్టు బార్ అసోసియేషన్ భవనంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బాధితుల ఫిర్యాదుల ఆధారంగా తగిన విచారణ జరిపి నిందితులపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. కేసులు నమోదు చేయకపోతే బాధితులు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అప్పటికీ స్పందించకపోతే కోర్టుల్లో ప్రైవేట్ కంప్లయింట్ దాఖలు చేయడానికి అవకాశం ఉందన్నారు. దాడులు జరిగేటప్పుడు సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు, వీడియోలు చిత్రీకరిస్తే సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని చెప్పారు. బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ కేంద్ర కార్యాలయం, జిల్లా సెల్ ప్రతినిధులు అందుబాటులోఉంటారని,ప్రతి నియోజకవర్గానికి న్యాయవాదులనునియమించినట్లు తెలిపారు. పార్టీ నాయకుల ద్వారా లీగల్ సెల్ సభ్యులను సంప్రదిస్తే న్యాయ సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త!

- ఎరువులు కొనుగోలులో అప్రమత్తత అవసరం
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందినవే మేలంటున్న అధికారులు



ఖరీఫ్ పనుల్లో నిమగ్నమైన రైతు

హిరమండలం: తొలకరి సాగుకు సర్వం సిద్ధమైంది. పుడమి పుత్రులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం ఆసన్నమైంది. ఈ తరుణంలో నకిలీ విత్తనాలు, ఎరువులు అంటకట్టేందుకు కొన్ని ప్రైవేటు కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆకర్షణీయ ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఏమార్చుతున్నాయి. కొందరు ఏకంగా డీలర్లకు ప్యాకేజీలు, విదేశ టూర్లు సైతం ఆఫర్లు చేస్తున్నారు. రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, మైక్‌సెట్లు ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లను ముంచెత్తుతున్నాయి. ఈ తరుణంలో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

జాగ్రత్తగా పరిశీలించాలి..

కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు ఆకర్షితమై విత్తనాలు కొనుగోలు చేస్తే మోసపోయే అవకాశముంది. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో గుర్తింపు లేని లేబుల్‌తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నీ సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో లేవో జాగ్రత్తగా పరిశీలించాలి.

విత్తనాల ఎంపిక ఇలా..

- వ్యవసాయశాఖ లైసెన్సులు పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారుని సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనరాదు.
- విత్తన ప్యాకెట్ సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదా నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకూ భద్రపరచాలి.
- మొలకెత్తే, పూత దశలో ఉన్నప్పుడు పంటలో లోపం కనిప్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు ఎలా కొనాలంటే ..

- అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే తీసుకోవాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీలు ఉందో లేదో పరిశీలించాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారుపేరు ఉంటేనే కొనాలి. చిల్లులు పడిన ఎరువుల బస్తాలను కొనవద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

పురుగు మందులు కొనేముందు..

- వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగు మందులు కొనుగోలు చేయాలి.
- పురుగుమందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలంరంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులు ఉంటాయి.
- పురుగుమందులు రెండు మూడు రకాలు కలిపి వాడరాదు. వాడిన డబ్బాలను, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగుమందుల వాడకానికి వినియోగించే పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించవద్దు.

దళారులను నమ్మవద్దు



ప్రభుత్వ లైసెన్సు కలిగిన డీలర్ల వద్దే నాణ్యమైన విత్తనాలు కనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదులను రైతుల వద్ద భద్రపర్చుకోవాలి. నకిలీ విత్తనాలు కొనిమోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు. ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే అధికారులను సంప్రదించాలి.

– బి.సంధ్య, వ్యవసాయశాఖాధికారి, హిరమండలం

నఖిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మెట్టూరులో షాపులో వరి విత్తనాల నమూనాలు సేకరిస్తున్న కొత్తూరు ఏఓ శ్రీనివాసరావు

కొత్తూరు: విత్తన అధీకృత వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కొత్తూరు మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని మెట్టూరులో ఓ ప్రైవేటు ట్రేడర్స్ వద్ద వరి విత్తనాలు నమూనాలు శనివారం సేకరించారు. వీటిని తిరుపతిలోని కోడింగ్ కేంద్రానికి పరీక్షల కోసం పంపించినట్లు చెప్పారు. విత్తన పరీక్షలో ఎటువంటి తేడాలు వచ్చినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మండలానికి 1507 క్వింటాళ్ల వరి విత్తనాలు రాయితీపై మంజూరైనట్లు చెప్పారు. వీటిని రైతు భరోసా కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు 90 శాతం రాయితీపై 420 క్వింటాళ్ల విత్తనాలు అందిస్తున్నామన్నారు. ప్రైవేట్ వర్తకులు విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల్లో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆధునిక సౌకర్యాలతో 'టైజర్'



టైజర్ కారును ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం హసీబ్

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టయోటోకు చెందిన సరికొత్త సౌకర్యాలతో మార్కెట్‌లోకి వచ్చిన అద్భుత వాహనం అర్బన్ క్రూయిజర్ టైజర్ అని భారతీయ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఏఏ హసీబ్ అన్నారు. శనివారం శ్రీకాకుళం పెద్దరోడ్డులోని టయోటో కంపెనీ షోరూం వద్ద శనివారం సరికొత్త టైజర్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారు ప్రారంభ ధర రూ.7.73 లక్షలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఫైనాన్స్ స్కీంలు, ఓనర్‌షిప్, మెయింటెనెన్స్ ప్యాకేజీలు, ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోడీ టయోటో ఉపాధ్యక్షుడు పి.బి.ఆచారి, సేల్స్ జనరల్ మేనేజర్ విశ్వేశ్వరరావు, షోరూం సర్వీస్ మేనేజర్ తాండ్ర చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో పర్తియాత్ర



సెంట్రల్ ట్రస్టీ రత్నాకర్‌తో జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాకు చెందిన సత్యసాయిబాబా భక్తులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 21వ పర్తియాత్రకు సంబంధించి సెప్టెంబరు 21, 22, 23 తేదీల్లో అనుమతి లభించిందని జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్, రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావులను కోరగా అనుమతించారని పేర్కొన్నారు. జిల్లాలో జరుగుతున్న నిత్య నారాయణసేవలు, వైద్యసేవలు, సంస్కృతి, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేసేలా బాలవికాస్ తరగతులు నిర్వహించడంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని కొనియాడరని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆప్షన్ల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్ -2024 కౌన్సెలింగ్‌లో భాగంగా ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి కాగా ఆప్షన్లు ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 10 వరకు ప్రక్రియ కొనసాగనుంది. వెబ్ కౌన్సెలింగ్ విధానంలో తమకు నచ్చిన కళాశాలలు, బ్రాంచ్‌ల కోసం విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ మేరకు ఈ నెల 11న ఆప్షన్ల మార్పుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 13న సీట్లు, కళాశాలల ఎలాట్‌మెంట్ ప్రకటిస్తారు. సీట్లు లభించిన విద్యార్థులు ఈ నెల 14 నుంచి 19 మధ్య కళాశాలల్లో చేరవచ్చు. క్లాస్‌వర్కు మాత్రం 14 నుంచే ప్రారంభించనున్నారు.

వృద్ధుడికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని రైతుబజారు ఎదురుగా తిరుమల ఆస్పత్రి వద్ద ఓ వృద్ధుడిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు చెప్పిన వివరాల మేరకు.. పొందూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గార శ్రీనివాసరావు తన గ్రామానికి చెందిన వ్యక్తి నగరంలోని తిరుమల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని శుక్రవారం పరామర్శకు వెళ్లాడు. తిరిగి బయటకు రాగా చినబజారు నుంచి బైక్‌పై వస్తున్న ఓ యువకుడు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

● వెంకన్నకు విశేష అలంకరణ



శ్రీకాకుళం చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారిని తులసి మాలలతో అలంకరణ చేశారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. ఉత్సవ మూర్తులకు కూడా ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

చంటిబిడ్డలకు ఎంత కష్టం..!



కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద చిన్నారితో కలిసి యాచిస్తున్న మహిళ

కాశీబుగ్గ : మండుటెండలో చిన్నారులు నరకయాతను అనుభవిస్తున్నారు. చంటిబిడ్డలని కూడా చూడకుండా.. నిండు గర్భిణులతో సైతం యాచన చేయిస్తున్నారు. వాస్తవంగా యాచక వృత్తిలో ఉన్నవారు చేస్తున్నారో.. లేక వీరి వెనుక ముఠా ఉందో తెలియదు గానీ అధిక ఉష్ణోగ్రతల నడుమ వాహనాల కాలుష్యం మధ్య ప్రమాదకరంగా రైలు పట్టాలను దాటుతూ వాహనాలు ఎక్కుతూ దిగుతూ పసి పిల్లలను వెంటపెట్టుకుని యాచన చేస్తున్న తీరు హృదయ విదారకంగా ఉంటోంది. కాశీబుగ్గ ఎల్‌సీ గేటు సమీపంలో పంటపొలంలో గుడారాలు వేసుకుని గేటు వేయగానే ఇట్టే వాలిపోతున్నారు. ఉదయం పది గంటలకు ప్రారంభమవుతున్న వీరి దినచర్య సాయంత్రం నాలుగు గంటల వరకు నిరాటంకంగా కొనసాగుతోంది. రైలు గేటు ప్రతి అరగంటకు రెండు సార్లు వేస్తుండటం ఒక్కోసారి సుమారు 30 నిమిషాల సమయం పడుతుండటంతో వీరికి అవకాశంగా మారింది.

ఈ విషయమై జిల్లా హ్యూమన్ ట్రాకింగ్ యూనిట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు సదాశివుని కేశవరావు వద్ద ప్రస్తావించగా అటువంటి వారిని అరెస్టు చేసి చిన్నారులను కాపాడి చిల్డ్రన్ హోంకు తరలిస్తామని చెప్పారు. పలాస, కాశీబుగ్గ పరిధిలో ఏఎస్ఐ గణపతిరావును చైల్డ్ వెల్ఫేర్ పోలీసు ఆఫీసర్‌గా నియమించి చంటిబిడ్డలకు రక్షణకల్పించి వసతి భోజన సౌకర్యాలు ప్రభుత్వం తరపున అందిస్తామని తెలిపారు.

ఇంటి వద్దే స్పాట్ అడ్మిషన్

- ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల వినూత్న ప్రయత్నం



చిన్నారికి అడ్మిషన్ ఇస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 10వ వార్డు పెంటవీధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో అడ్మిషన్లను విద్యార్థుల ఇళ్ల వద్దే ఇస్తున్నారు. చిన్నారుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి వారి సమక్షంలోనే స్పాట్ అడ్మిషన్ చేస్తూ వినూత్న ఒరవడికి నాంది పలికారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉంటూ బడికి రావాల్సిన చిన్నారుల వివరాలను సేకరించి నేరుగా వారి ఇంటి వద్దకు చేరి కుటుంబ సభ్యులతో మాట్లాడి సౌకర్యాలను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. శనివారం డెంకివీధి, సెగిడివీధి, బ్రాహ్మణవీధి, హరిజన వీధి, పొందరవీధిలో పర్యటించి అడ్మిషన్లు కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రేణుకాదేవి, విద్యాశాఖ క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ) ఉర్నాన అప్పలరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన
లారీ క్లీనర్ మృతి

ఎచ్చెర్ల క్యాంపస్:

జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్ సుప్రజిత్ సాహిన్ (38) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. నవభారత్ ప్లై ఓవర్‌పై విశాపట్నం వైపు వెళుతున్న లారీని ఓవర్ టెక్ చేసే క్రమంలో వెనుక నుంచి వెళుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో క్యాబిన్‌లో కూర్చున్న క్లీనర్ తీవ్రంగా గాయపడగా, శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

డ్రైవర్ ప్రదీప్ కుమార్ బెహరా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిది ఒడిశా రాష్ట్రం. అక్కడి నుంచి విశాఖపట్నం లోడుతో వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

జీడిపప్పు అక్రమ రవాణా!



కాశీబుగ్గ బస్టాండ్ నుంచి ప్రైవేటు బస్సులో తరలిపోతున్న జీడిపప్పు బస్తాలు

కాశీబుగ్గ: జీఎస్టీ, మార్కెట్ యార్డు అనుమతులు లేకుండానే కొందరు జీడిపప్పును అక్రమంగా తరలిస్తున్నారు. ప్రైవేటు బస్సుల్లో దర్జాగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఎక్కువగా పలాస నుంచి విశాఖకు గుట్టు తరలిస్తున్నారు. 60 కేజీలకు సంబంధించిన వేబిల్లులు, ఇతర అనుమతులు చూపించి టన్నులకొద్దీ జీడిపప్పును ప్రైవేటు బస్సులో అక్రమ రవాణా చేస్తున్నారు. విశాఖ, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి పలాసకు ప్రయాణించే సుమారు 20 ప్రైవేటు బస్సుల్లో రహస్యంగా ఈ వ్యవహారం నడుస్తున్నట్లు సమాచారం. విశాఖకు చేరిన వెంటనే అక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు తరలిస్తారు. కొందరు అధికారులకు నెలవారి మామూళ్లు చేరుతుండటంతో ఈ విషయంలో చూసీ చూడనట్లు విడిచిపెడతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలాస కోసంగిపురం జాతీయ రహదారి వంతెన వద్ద నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో సైతం ఇలా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రైలు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న రైల్వే చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ, తదితరులు

- చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ

విజయనగరం టౌన్: రైలు ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీఫ్ డీటీఐ సీహెచ్‌వీ రమణ సూచించారు. ఇంటర్నేషనల్ లెవిల్ క్రాసింగ్ అవేర్‌నెస్ డే పురస్కరించుకుని శనివారం స్థానిక వీటీ అగ్రహారం సమీపంలో ఉన్న రైల్వే లెవిల్ క్రాసింగ్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే క్రాసింగ్‌లు దాటే సమయంలో ప్రయాణికులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గేట్ కింద నుంచి దూరి వెళ్లడం సరికాదని సూచించారు. లెవిల్ క్రాసింగ్‌లు దాటినప్పుడు చెవిలో ఇయర్ ఫోన్ పెట్టుకుని వెళ్లడం మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్స్ ఆర్ఆర్.కుమార్, సీహెచ్ శ్రీధర్‌రావు, జి.జగన్నాథం, పి. గోవింద ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

18 సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్

కాశీబుగ్గ: రైళ్లు, రైల్వే స్టేషన్‌ల పరిధిలో వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పలాస జీఆర్‌పీ పోలీసులు తిరిగి వాటిని అందజేశారు. శనివారం పలాస రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ పోలీసు స్టేషన్ వద్దకు బాధితులను పిలిపించి రూ.5లక్షల విలువైన 18 సెల్‌ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ మాట్లాడుతూ చోరీకి గురైన సెల్‌ఫోన్లను సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా క్రైం బృందం రికవరి చేశారని చెప్పారు. కార్యక్రమంలో బృంద సభ్యులు వీ.కోదండరావు, సంతోష్‌కుమార్, రమేష్, దేవేంద్రనాథ్, తేజ, లోకనాథం పాల్గొన్నారు.

టీకాలే శ్రీరామరక్ష

- చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి
- ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

టెక్కలి: గర్భిణులతో పాటు అప్పుడే పుట్టిన చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే చాలామందికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి టీకాలపై సరైన అవగాహన లేకపోవడంతో అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసే ఈ వ్యాధి నిరోధక టీకాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని వైద్యులు చెబుతున్నారు. ప్రతి శనివారం, బుధవారం గర్భిణులకు, చిన్నారులకు వ్యాది నిరోధక టీకాలు వేస్తారు.



చిన్నారులకు టీకాలు వేసే షెడ్యూల్ తెలిపే బోర్డు

ఇదీ పరిస్థితి..

- గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే 3 నెలల నిండిన తరువాత టి.టి. ఇంజక్షన్ వేయాలి. నెల వ్యవధిలో మరో టి.టి.వేయాలి. వీటితో పాటు ఐరన్–ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ మాత్రలు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్ బి డోస్ వేయాలి. వీటి వల్ల పోలియో, పచ్చ కామెర్ల వ్యాధి నుంచి చిన్నారిని కాపాడవచ్చు.
- 14 రోజుల వ్యవధిలో బీ.సీ.జీ (క్షయ వ్యాధి రాకుండా) టీకా వేయాలి.
- 6 వారాలు, 14 వారాల్లో ఐ.పి.వి. చుక్కలు వేయాలి. వీటితో పాటు 6 వారాలు, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటావాలెంట్ వేయాలి. వీటి వల్ల కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మెదడువాపు వ్యాధి, పచ్చకామెర్లు రాకుండా చిన్నారిని కాపాడుకోవచ్చు.
- 9 నెలల నుంచి 12వ నెల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్ 'ఎ' చుక్కలు వేయాలి.
- 16 నెలల నుంచి 24 నెలల వ్యవధిలో బూస్టర్ డోస్ డీపీటీ, మీజిల్స్, విటమిన్ 'ఎ' ఓపీవీ వేయాలి.
- 5 సంవత్సరాలు పూర్తయితే డీ.పీ.టీ ఒక డోస్ వేయాలి.
- 10 సంవత్సరాలు, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్ (టీ.టీ) వేయాలి.
- 9 నెలల నుంచి 5 సంవత్సరాల వయసు లోపల ప్రతి 6 నెలలకు ఓసారి విటమిన్ 'ఎ' 9 డోస్‌లు వేయాలి.

అవగాహన అవసరం..

గర్భిణులకు, చిన్నారులకు నిర్దేశిత వేళల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. వీటి వల్ల ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఈ టీకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.

– బి.మహారాజ్, చిన్న పిల్లల వైద్య నిపుణుడు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి